ఆయకట్టు స్థిరీకరణ లేకుండా నిర్మాణాలెందుకు?

- దక్షిణ తెలంగాణలో లక్షల ఎకరాలకు నీరు లేదు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నిర్వాసితులనుద్దేశించి మాట్లాడుతున్న తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆయకట్టు స్థిరీకరణ చేయకుండా.. వేలాది ఎకరాలను ముంపుకు గురిచేసి రైతులను నిర్వాసితులను చేసి ప్రాజెక్టులు ఎందుకు నిర్మాణం చేస్తున్నారని సిపిఎం రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గద్వాల జిల్లా గట్టు మండల పరిధిలో నిర్మిస్తున్న చిన్నోనిబాయి రిజర్వాయర్ పనులను నిలిపేయాలని కోరుతూ ఆందోళన చేస్తున్న నిర్వాసితులకు శనివారం ఆయన మద్దతు ప్రకటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో తమ్మినేని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం సాగునీటి కోసమే చేశారని గుర్తు చేశారు.

కానీ, సాగునీటి అవసరం లేకుండా భూములు కోల్పోయేలా ప్రాజెక్టులు నిర్మించడం సరికాదన్నారు. ఏ ప్రాంతంలో సాగునీరు అవసరం ఉందో జిల్లాల వారీగా సర్వే చేసి ప్రాజెక్టులు నిర్మించాలి తప్ప చిన్నోనిపల్లి లాంటి ఆయకట్టు లేని ప్రాంతాల్లో ప్రాజెక్టులు నిర్మించడం అవివేకమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి దానినే మోడల్‌గా చూపించడం సరికాదన్నారు.

దక్షిణ తెలంగాణలో లక్షల ఎకరాలకు సాగునీరు అందివ్వకుండా బంగారు తెలంగాణ ఎలా సాధ్యమన్నారు. ప్రాజెక్టుల నిర్మాణాలు లోపభూయిష్టంగా ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో నిర్మిస్తున్న ప్రాజెక్టులను పరిశీలిస్తే భూములకు సాగునీరు ఇవ్వడం కంటే కాంట్రాక్టర్లకు డబ్బులు ముట్టజెప్పడమే ప్రధాన ధ్యేయంగా కనిపిస్తుందన్నారు. రిజర్వాయర్ల ద్వారా సాగు భూములు తడపాల్సింది పోయి రైతులను నిర్వాసితులను చేసి వారికి కన్నీళ్లు తెప్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిమిత సమయంలో భూములను ఉపయోగంలోకి తీసుకురాకపోతే స్వాధీనం చేసుకున్న వాటిని తిరిగి రైతులకు ఇచ్చేయాలని చెప్పారు. ఆ చట్ట ప్రకారం 17 సంవత్సరాలు దాటినా వాడుకోని భూములను రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లక్షలాది ఎకరాల భూములను సాగునీటి ప్రాజెక్టుల పేరుతో తీసుకొని మార్కెట్ ధర కన్నా తక్కువగా పరిహారం చెల్లిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు విషయంలో రైతులు ఉద్యమాలు చేసినందువల్ల ఎకరాకు 60 లక్షలు పరిహారం ఇచ్చిన విషయం గుర్తు చేశారు. రైతులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సిపిఎం ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం గద్వాల జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి, ఉద్యమ కన్వీనర్ నరేష్, నాయకులు నరసింహా, నర్మద, దేవదాన్, పరంజ్యోతి, ఆంజనేయులు, మారన్న, సవారన్న మద్దిలేటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సియులో రణరంగం

- ఎస్ఎఫ్ఐ నాయకులపై ఎబివిపి కార్యకర్తల దాడి
- పలువురికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రణరంగంగా మారింది. శుక్రవారం విద్యార్థి సంఘాల ఎన్నికలు జరగ్గా.. అదే రోజు అర్ధరాత్రి ఎబివిపి నాయకులు ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడికి దిగారు. ఈ ఘటనలో ఎస్ఎఫ్ఐ నాయకులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ నాయకులు శివ దుర్గారావు మాట్లాడుతూ.. ఎబివిపి నాయకులు తమపై క్రూరంగా దాడి చేశారని, ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో ఎఫ్ హాస్టల్ లోపలికి చొరబడి దాడికి తెగబడ్డారని విమర్శించారు. మద్యం మత్తులో ఎబివిపి విద్యార్థి సంఘం సభ్యులు తమను దుర్భాషలాడుతూ గొడవకు దిగారని, హాస్టల్‌పై దాడి చేసి అద్దాలు పగులగొట్టారని తెలిపారు. హాస్టల్ ముందు పడి ఉన్న పదునైన గాజు ముక్కలు, సైకిళ్లతో తమపై దాడి చేశారని తెలిపారు. ఎన్నికల్లో ఓటమి భయంతో ఎబివిపి రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోందని, హింసను ఆశ్రయిస్తోందని ఆరోపించారు. దాడులకు వ్యతిరేకంగా విద్యార్థి లోకమంతా ఐక్యంగా నిలబడాలని కోరారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రశాంత వాతావర ణంలో జరిగేవని, నేడు ఎబివిపి నాయకులు ఈ రకమైన భౌతికదాడులకు పూనుకో వడం దారుణమన్నారు. దీన్ని ప్రజాస్వామ్య వాదులు ఖండించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తోన్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై అవగాహన కల్పిస్తూ ఎన్నికల్లో తమ పానెల్ పోటీ చేసిందని తెలిపారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని ఎబివిపి నాయకులు తమపై అకారణంగా దాడి చేశారని తెలిపారు. ఇలాంటి భౌతికదాడులకు యూనివర్సిటీ విద్యార్థులు ఎప్పటికీ అవకాశం ఇవ్వొద్దని కోరారు. ఈ విషయంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతామని తెలిపారు.

నేటి నుంచి ఇంటింటికి టిడిపి

- చంద్రబాబు రాక

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో తెలుగుదేశం పూర్వవైభవం దిశగా అడుగులుపడుతున్న వేళ యువత, మహిళలు, విద్యావంతులకు పెద్దపీట వేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. రాష్ట్రంలో ఆదివారం నుంచి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ఉదయం 10 గంటలకు తెలుగుదేశం అధినేత, మాజీ సిఎం చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వివరించారు. శనివారం హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్‌లోని తన నివాసంలో మీడియాతో కాసాని చిట్‌చాట్ నిర్వహించారు. రాష్ట్రంలో పదిరోజులపాటు మండలం యూనిట్‌గా ప్రతిబూత్‌స్థాయిలో ఇంటింటికి టిడిపి కార్యక్రమం చేపడతామని ప్రకటించారు. అన్ని పురపాలక సంఘాలు,నగరపాలక సంస్థల్లో డివిజన్లవారీగా కొనసాగుతుందని తెలిపారు. ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసుకుంటూ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కూడా చేపడతామని ప్రకటించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అన్ని డివిజన్లలో ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో భాగంగా నాడు ఎన్‌టిఆర్, చంద్రబాబు హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు వివరిస్తామని స్పష్టం చేశారు. కిలో రూ. రెండు బియ్యం పథకం, పట్వారీ, పటేల్ వ్యవస్థ రద్దు, మహిళలకు ఆస్తిహక్కు, బిసి తరగతులకు పెద్దపీట తదితర అంశాలు వివరించడంతోపాటు టిడిపికి పూర్వ వైభవం కోసం సలహాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు. పది రోజుల తర్వాత మరో 20 రోజులపాటు ప్రతి మండలంలో అన్ని గ్రామాల్లో బస్సు యాత్రలు చేపడతామని ప్రకటించారు. టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 27న సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో 'సింహగర్జన' పేరిట లక్షల మందితో భారీ బహిరంగసభ నిర్వహిస్తామని చెప్పారు. కాగా చంద్రబాబు రాక నేపథ్యంలో శనివారం కాసాని పార్టీ పార్లమెంటు నియోజక వర్గ ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఇందులో పార్టీ రాష్ట్ర సమన్వయకర్త కుంభంపాటి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వాల్మీకి హక్కుల పోరాట సమితి, బేడ బుడగ జంగం హక్కుల సాధన సమితి, సంచార జాతుల జెఎసి నాయకులు ఎన్‌టిఆర్ భవన్‌లో కాసానిని కలిశారు.

మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే..

- మొదటిసారి కౌన్సెలింగ్..రెండోసారి జైలే
- మైనర్‌లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబ డితే చట్టం ప్రకారం శిక్షార్హులు అవుతారని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్‌పి కె నర్సింహ అన్నారు. మొద టిసారి పట్టుబడితే కౌన్సెలింగ్ ఇస్తామని, రెండోసారి పట్టుబడితే జైలుకు పంపుతామని ఆయన హెచ్చరించారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారితో పాటు వారి తల్లిదండ్రులను పిలిచిన పోలీసులు శనివారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై వారిని ఉద్దేశించి ప్రసంగించారు. 18 ఏళ్లకు తక్కువగా ఉండి వాహ నాలు నడిపినా, లైసెన్స్ లేకపోయినా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ఎదుటివారి ప్రాణాలు పోవడానికి కార ణమైతే క్రిమినల్ కేసు నమోదవుతుందని, దాదాపుగా హత్యకేసు నమోద వుతుందని తేల్చిచెప్పారు. ఆటోలో నలుగురు ఎక్కాల్సి ఉండగా 10-15 మంది ని ఎక్కిస్తున్నారని, ఇద్దరు ఎక్కాల్సిన టూవీలర్‌పై పిల్లలతో కలిసి నలుగురు ఎక్కుతున్నారని, దీనివల్ల ప్రమాదం జరిగినప్పుడు కుటుంబమే నష్టపోవాల్సి వస్తుందన్నారు. డీఎస్పీ మహేశ్, ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్ పాల్గొన్నారు.

పరేడ్ మైదానంలో వీక్లీ పరేడ్

జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో శనివారం సిబ్బందికి వీక్లీ పరేడ్ నిర్వ హించారు. ఎస్పీ కె నరసింహ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు విధులు నిర్వర్తించేది ప్రజలకు రక్షణ కల్పించడానికి, వారి భద్రతకోసం అహర్నిశలు పనిచేయాలని, అందుకే పోలీసులు నిత్యం శారీరకంగా, మానసికంగా ధడం గా ఉండాలని సూచించారు. పోలీస్ డిపార్ట్‌మెంట్ అనేది క్రమశిక్షణతో కూడిన సమూహ ప్రయాణమని తెలిపారు. సిబ్బంది వ్యక్తిగత క్రమశిక్షణ డిపార్ట్‌మెం ట్‌లో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏ రాములు, డీఎస్పీలు వెంకటరమణారెడ్డి లక్ష్మణ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్‌కు సైబర్ నేరగాళ్ల టోకరా

- రూ. 2,24,967 లక్షలు మాయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సైబర్ నేరగాళ్లు.. బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్‌కే వల విసిరారు. బ్యాంకు ఖాతాదారులను అప్రమత్తం చేయాల్సిన అధికారి నేరగాళ్ల మాయలో పడి అకౌంట్ ఖాళీ చేసుకున్నారు. ఖాతా నుంచి రూ.2,24,967 మాయమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. హన్మకొండ జిల్లా పరకాల పట్టణంలోని పరకాల ఎస్‌బిఐ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్‌గా సకల్‌దేవ్ సింగ్ పని చేస్తున్నారు. రెండు రోజుల కిందట ఆయన మొబైల్‌కు 'మీ ఖాతా డీ యాక్టివేట్ అవుతుంది. పాన్ కార్డు అప్‌డేట్ చేయండి' అని మెసేజ్ వచ్చింది. ఆయన శుక్రవారం ఉదయం ఆ మెసేజ్‌ను క్లిక్ చేసి అప్‌డేట్ చేసేందుకు ప్రయత్నించగా సక్సెస్ కాలేదు. అనంతరం మరో నంబర్ నుంచి ఆయనకు ఫోన్ వచ్చింది. తాను చెప్పినట్టు చేయాలని అవతలి వ్యక్తి సూచించగా.. బస్సులో ఉన్నాను తర్వాత చేస్తానని సకల్ దేవ్‌సింగ్ చెప్పారు. బ్యాంకుకు వెళ్లిన తర్వాత ఆయనే తనకు వచ్చిన నంబర్‌కు ఫోన్ చేశారు. అవతలి వ్యక్తి పాన్ కార్డు అప్‌డేట్ చేయాలని సూచించగా కావడం లేదని చెప్పారు. ఆ వెంటనే వాట్సాప్‌కు ఒక లింక్ పంపానని, దాన్ని ఓపెన్ చేయాలని ఆ వ్యక్తి చెప్పాడు. ఈ మేరకు వేరే నంబరు నుంచి లింక్ పంపించగా దాన్ని మేనేజర్ ఓపెన్ చేశారు. దీంతో ఆయన ఖాతాలోంచి రూ.2,24,967 కట్ అయ్యాయి. దీంతో శుక్రవారం రాత్రి పరకాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైబర్ నేరం కింద పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

53,85,071 మందికి కంటి పరీక్షలు

సమాచార, పౌర సంబంధాల శాఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా రెండో దశ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 53,85,071 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. శనివారం రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. వీరిలో 6,93,644 మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాలను పంపిణీ కోసం రెఫర్ చేయగా, 9,93,461 మందికి రీడింగ్ గ్లాసెస్ అందజేశారు. కంటి వెలుగు శిబిరాలకు అన్ని వయస్సుల వారి నుంచి విశేష స్పందన లభిస్తున్నది. వైద్య ఖర్చులకు భయపడి, అవగాహన లేక వాయిదా వేసుకుంటూ వస్తున్న వారికి ఇంటి దగ్గరలోనే పరీక్షల శిబిరం పెట్టడం కలిసి వస్తున్నది. ఉద్యోగులు, జర్నలిస్టులు, పోలీసులు, న్యాయవాదులు తదితర వారికి వర్గాల వారీగా ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నారు. ములుగు జిల్లాల్లో నిర్వహిస్తున్న శిబిరాల్లో నమోదవుతున్న వివరాల ప్రకారం చూస్తే...ఎక్కువ మందిలో దగ్గరి చూపు సమస్య ఉన్నట్టు గుర్తించారు.

పిల్లల్లో క్రీడా స్ఫూర్తికి పోటీలు దోహదం

- నగర పోలీస్ కమిషన్ సి.వి.ఆనంద్

ప్రజాశక్తి - కల్చరల్

పిల్లల్లో క్రీడా స్ఫూర్తికి వివిధ రంగాల్లో ఆరోగ్యకరమైన పోటీలు దోహదపడతాయని నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ అన్నారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై స్మార్ట్ జీనియస్ నిర్వహణలో అంతర్జాతీయ స్థాయిలో చేతి రాత, వేద గణితం, అబాకస్‌లో 2023 సంవత్సరానికిగానూ జరిగిన పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సి.వి.ఆనంద్, జెఎన్‌టియు ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ కట్ట నరసింహరెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ మంజూర్ హుస్సేన్‌లతో కలిసి బహుమతులు అందజేసి మాట్లాడారు. మేధస్సుకు పదునుపెట్టే అబాకస్‌ను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని అన్నారు. స్మార్ట్ జీనియస్ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. స్మార్ట్ జీనియస్ చైర్మన్ రాజ్యలక్ష్మి రాజమోహన్ స్వాగతం పలుకుతూ ప్రభుత్వ గుర్తింపు పొందిన తమ సంస్థ గత కొన్నేళ్లుగా తర్కం, గణితం, జీవన నైపుణ్యం, అబాకస్ వంటి ప్రక్రియలలో హైస్కూల్ స్థాయి వారి వరకు పోటీలు నిర్వహిస్తోందని తెలిపారు. 2023లో ఇండియాతోపాటు బ్రిటన్, అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ, సింగపూర్, అరబ్ ఏమీరైట్స్, ఇండోనేషియా వంటి దేశాలకు చెందిన పది వేల మంది పిల్లలు పాల్గొన్నారని తెలిపారు. వారిలో వివిధ విభాగాల్లో వేయి మందిని విజేతలుగా ఎంపిక చేశామని, వారితోపాటు 150 మందిని ఛాంపియన్స్‌గా గుర్తించి వారికి అబ్దుల్ కలాం పేరిట నగదు పురస్కారాలు అందిస్తున్నామని తెలిపారు.

సాహిత్య సమ్మోహనం 'ధార'

- 'అనంతోజు' అధ్యయనం భేష్
- 'ధార' పుస్తకావిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

సాహిత్యరంగంలో అనంతోజు మోహనకృష్ణ రచనలు 'ధార'గా మొదలై, సముద్రంగా విస్తరించి, సమాజ చైతన్య గమనానికి దిశానిర్దేశనం చేయాలని పలువురు వక్తలు అభిలషించారు. ఆయనకు సార్వజనీన వ్యాసరచనా స్వభావాన్ని మార్క్సిస్టు సిద్ధాంతమే తెచ్చిపెట్టిందని అభిప్రాయపడ్డారు. అనంతోజు మోహనకృష్ణ రచించిన 'ధార' సాహిత్య వ్యాసాల పుస్తకావిష్కరణ సభ శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం దొడ్డి కొమురయ్య హాల్‌లో జరిగింది. తెలంగాణ సాహితీ ఉపాధ్యక్షులు రాంపల్లి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి గౌరీశంకర్ ముఖ్య అతిథిగా హాజరై, పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకానికి 'ధార' అనే పేరును నామౌచిత్యంగా పెట్టారనీ, దానిలోని 15 వ్యాసాలు సార్వజనీన సాహిత్యంగా నిలిచేవని అన్నారు. అనేకమంది సాహిత్య నిష్ణాతులకు కూడా తెలియని అంశాలను మోహనకృష్ణ తన రచనల ద్వారా వెలుగులోకి తెచ్చారని అభినందించారు. పుస్తక పరిచయం చేసిన కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత తగుళ్ల గోపాల్ మాట్లాడుతూ కవులు, కథకులతో పాటు వ్యాసకర్తలకూ పరిశోధనా దృక్పథం ఉంటుందనీ, దానికి సామ్యవాద మానవతావాదాన్ని జోడించి రచనలు చేస్తే చరిత్రలో చిరస్థాయిగా మిగిలిపోతాయన్నారు. తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ సమాజంలో చైతన్యాన్ని నింపే ఇరుసు లాంటి వ్యాసాలను మోహన కృష్ణ రాశారని అభినందించారు. ప్రముఖ రచయిత్రి జ్వలిత మాట్లాడుతూ సమాజానికి కావల్సిన ప్రయోజనాలను ఈ పుస్తకం ద్వారా వెల్లడించారనీ, ఇది విద్యార్థులకు పరిశోధనార్థంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రముఖ సినీ గేయరచయిత మౌనశ్రీ మల్లిక్ మాట్లాడుతూ ప్రతిభకంటే సంస్కారం గొప్పదనీ, భాషా విస్మృతికి అదే తొలి మెట్టు అని చెప్పారు. పాత తరం స్ఫూర్తిపొందే పద్ధతిలో నేటి యువతరం రచనలు చేస్తున్నదని కొనియాడారు. నవతెలంగాణ సంపాదకులు ఆర్ సుధాభాస్కర్ మాట్లాడుతూ సాహిత్యం ప్రజల పక్షాన నిలవాలని ఆకాంక్షించారు. తెలంగాణ సాహితి ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి మాట్లాడుతూ పత్రికారంగం సాహిత్యకారులకు అద్భుత వేదిక అని చెప్పారు. ప్రజాపక్షాన నిలిచే ఉద్యమాల స్ఫూర్తి నుంచి వచ్చే అక్షరాలే చరిత్రగా నిలుస్తాయని తేల్చిచెప్పారు. తెలుగు అధ్యాపకులు డాక్టర్ బీ జయరావు, బోడేపూడి విజ్ఞాన కేంద్రం పూర్వ జనరల్ మేనేజర్ సీహెచ్ రాజారావు రచయిత మోహనకృష్ణకు శుభాశీస్సులు అందచేశారు. కార్యక్రమాన్ని పేర్ల రాము సమన్వయం చేశారు.

'క్యాష్'పిటల్ హబ్..

- విస్తరిస్తున్న వైద్య వ్యాపారం
- ఓనమాలు తెలియని వారూ వైద్య రంగంలో పెట్టుబడులు
- పదుల సంఖ్యలో పెరిగిన నాన్ డాక్టర్స్ ఆస్పత్రులు
- అర్హత లేని వైద్యులతో హైరిక్స్ ఆపరేషన్లు
- పిఆర్‌ఓలు, మార్కెటింగ్ సిబ్బందితో వ్యాపార విస్తరణ
- రెఫరల్ కేసులు అందిస్తే కమీషన్లు, గిఫ్టులు, ట్రిప్పులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉత్తర తెలంగాణలోనే ఆస్పత్రుల హబ్‌గా ఉన్న కరీంనగర్ జిల్లా 'క్యాష్‌పిటల్ హబ్‌గా మారింది. వైద్యంలో ఓనమాలు కూడా తెలియని లీడర్లు, రియల్టర్లు, బిల్డర్లు, ఫైనాన్షియర్లు, బడా వ్యాపారాలు పదుల సంఖ్యలో వైద్య రంగంలోకి వచ్చారు. ఒక్క జిల్లా కేంద్రంలోనే 260 ప్రయివేటు ఆస్పత్రులు ఉండగా.. ఇందులో సుమారు వందకుపైగా ఆస్పత్రులన్నీ నాన్ డాక్టర్స్ ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి. విజిటింగ్ డాక్టర్లు, అర్హతలేని ఫారిన్ సర్టిఫికెట్ డాక్టర్లతో కార్పొరేట్‌ను తలదన్నేలా అద్దాల మేడల్లో వైద్య వ్యాపారాన్ని సాగిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగానూ ఇదే పరిస్థితి. ఆర్ఎంపి, పిఎంపి, ప్రయివేటు ల్యాబ్‌టెక్నీషియన్లు, అంబులెన్స్ డ్రైవర్లను ఏజెంట్లుగా మలుచుకుని.. పిఆర్ఒలు, మార్కెటింగ్ సిబ్బందిని నియమించుకుని 'రెఫరల్' కేసుల బిల్లుల్లో కమీషన్లు, గిఫ్టులు, ట్రిప్పులు అందిస్తున్నారు. వైద్యం వికటించి ప్రాణాలమీదికొచ్చినప్పుడు నయానో బయానో బాధితులకిస్తూ చేతులుదులుపుకుంటూ యథావిధిగా తమ దందా సాగిస్తున్నారు.

పుట్టగొడుగుల్లా ప్రయివేటు ఆస్పత్రులు

రెండు కార్పొరేషన్లు, 14 మున్సిపాలిటీలు ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నగరాలు, పట్టణాలు సహా చిన్న టౌన్లు, మండల కేంద్రాల్లో సూపర్ స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ పేర్లతో ప్రయివేటు ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఆ ఆస్పత్రుల్లోని బోర్డుల్లో ఉండే స్పెషలిస్టులు హాస్పిటల్‌లో కనిపించరు. వారి స్థానంలో అర్హత లేని డాక్టర్లు ట్రీట్‌మెంట్ చేస్తున్నారు. కొన్ని చోట్ల ఎంబీబీఎస్‌లు.. ఎండీలుగా, సర్జన్లుగా చలామణి అవుతుంటే, ఇంకొన్ని చోట్ల హోమియో, ఆయుర్వేద వైద్యులు స్పెషలిస్టులుగా చెప్పుకుంటూ వైద్యం చేస్తున్నారు. చాలా చోట్ల ఆర్ఎంపీలు, పీఎంపీలు నర్సింగ్‌హోంలు నిర్వహిస్తుండటం గమనార్హం.

నెలవారీ మామూళ్లు.. నేతల ఒత్తిళ్లు

సరైన అర్హతలు లేకున్నా పేషెంట్లను చేర్చుకొని చికిత్స చేస్తున్న ఆస్పత్రుల్లో.. రోగి ఆరోగ్యంతో బయటపడితే తమ ఘనతగా ప్రచారం చేసుకుంటున్నారు. పరిస్థితి విషమిస్తే హైదరాబాద్‌కు రెఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. పేషెంట్ అక్కడే చనిపోతే రూ.లక్షల్లో డబ్బులిచ్చి సెటిల్‌మెంట్లు కూడా చేస్తున్నారు. ఇలాంటి ప్రయివేటు ఆస్పత్రులను నియంత్రించాల్సిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నెలవారీగా వచ్చే మామూళ్లు.. ఆస్పత్రులకు అండగా ప్రభుత్వ నేతల ఒత్తిళ్ల నడుమ అది తమ పని కాదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. చాలా ఆస్పత్రులకు, వాటికి అనుబంధంగా ఉన్న ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు, మెడికల్ షాపులకు రిజిస్ట్రేషన్లు, పర్మిషన్లు లేకున్నా పట్టించుకోవడం లేదు. పేషెంట్ల నుంచి ఫిర్యాదులు వచ్చినప్పుడు నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నాన్ డాక్టర్స్ ఆస్పత్రుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రోగులను ఆస్పత్రిలో చేర్పించే సమయంలో పూర్వాపరాలు తెలుసుకోవాలి. నాన్ డాక్టర్స్ ఆస్పత్రుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ఇలాంటి ఆస్పత్రులపై అధికారులు కఠినంగా చర్యలు తీసుకోవాలి.

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బిఎన్.రావు

భారత్ స్వశక్తితో ఎదుగుతున్న దేశం

- టియులో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'భారత్.. అత్యంత వేగవంతంగా అభ్యున్నతి చెందుతున్న దేశం. స్వయం శక్తితో ఎదుగుతున్నది. 20 దేశాలకు ఆధిపత్యం వహిస్తున్న సందర్భంలో గర్వంగా ఉంది. మన కలను సాకారం చేసుకొనే దిశగా పయణించాలి' అని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీలో శనివారం "ఇండియాస్' జి 20 ప్రెసిడెన్సీ: ఆపర్చునిటీస్ అండ్ ఛాలెంజెస్ ఫర్ ఇండియా యాస్ ది గ్లోబల్ లీడర్" అంశంపై నిర్వహించిన సదస్సులో గవర్నర్ పాల్గొన్నారు మొదట ఉపకులపతి ఆచార్య డి.రవీందర్ గవర్నర్‌కు స్వాగతం పలికారు. 7వ బెటాలియన్ పోలీస్ సిబ్బంది 'గాడ్ ఆఫ్ ఆనర్' (గౌరవ వందనం) చేశారు. తెలంగాణ విశ్వవిద్యాలయం, అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సును జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగించారు.

భారతదేశం జీ-20 దేశాల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో గ్రూప్ ఆఫ్ నేషన్స్, యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)- న్యూఢిల్లీ, దేశంలోని విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలను విభిన్న కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించిందన్నారు. ఇప్పుడు భారతదేశం ఒక శక్తివంతమైన దేశంగా ఎదుగుతుందన్నారు. 85 శాతం అంతర్జాతీయ స్టార్టప్ కంపెనీలు మన దేశ సహకారం కోసం ఎదురుచూస్తున్నాయని చెప్పారు. భారతదేశ చరిత్ర అజరామరం అయిందన్నారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటం ప్రపంచ దేశాలకు శాంతి, అహింస మార్గాలను చూపిందన్నారు. ఈ 2023వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని "ఇంటర్నేషనల్ డే ఆఫ్ మిల్లెట్స్" అనే సంక్షిప్త సందేశంతో ముందుకు వెళ్తుందని చెప్పారు. యువత ఏదైనా సాధించగలదని, అసాధారణ ప్రతిభ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య డి. రవీందర్, ఎబిఆర్ఎస్ఎం జాతీయ సంయుక్త కార్యనిర్వహణ కార్యదర్శి గుంత లక్ష్మణ్, రిజిస్ట్రార్ ఆచార్య బి.విద్యావర్ధిని, ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. ఆరతి, వీసీ సతీమణి సౌభాగ్యలక్ష్మి, సదస్సు డైరెక్టర్ డా.సత్యనారాయణ పాల్గొన్నారు.

హైసెన్స్ నుంచి కొత్త స్మార్ట్ ఎసిలు

న్యూఢిల్లీ : విప్లవాత్మక ఫీచర్లతో భావితరపు కొత్త స్మార్ట్ ఎసిలను విడుదల చేసినట్లు హైసెన్స్ ఇండియా తెలిపింది. ఇంటెల్లిప్రో, కూలింగ్ ఎక్స్‌పెర్ట్‌ను పేరుతో రెండు వేరియంట్లను ఆవిష్కరించినట్లు పేర్కొంది. 4డి స్వింగ్‌తో గుగూల్ అసిస్టెంట్ సహాయంతో ఇంటెల్లి ప్రో వై-ఫై స్మార్ట్ నియంత్రించడుతుందని తెలిపింది. ఈ రెండు ఎసిలు, 5 ఇన్ 1 కన్వర్టబల్ ప్రో ఫీచర్లు కలిగి ఉన్నాయని వెల్లడించింది. ఇవి రూ.31వేల ప్రారంభ ధరతో లభిస్తాయని తెలిపింది.

రాష్ట్రంలో జెకె టైర్ అవుట్‌లెట్ల విస్తరణ

హైదరాబాద్ : ప్రముఖ టైర్ల ఉత్పత్తుల కంపెనీ జెకె టైర్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తెలంగాణలో తమ మూడవ బ్రాండ్ షాప్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. హైదరాబాద్ - ముంబయి హైవే వద్ద దాదాపు 6 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ అవుట్‌లెట్‌ను ఆ కంపెనీ మొబిలిటీ సొల్యూషన్స్ అండ్ ఫ్లీట్ మేనేజ్‌మెంట్ హెడ్ సంజీవ్ శర్మ లాంఛనంగా ప్రారంభించారని పేర్కొంది. దీంతో దక్షిణాదిలో 32 ఔట్‌లెట్లకు, దేశంలో 77కు విస్తరించినట్లయ్యిందని ఆ కంపెనీ తెలిపింది.

ర్యాగింగ్‌పై యుజిసి హెచ్చరికలు పట్టించుకోలేదు

- బండివి చౌకబారు వ్యాఖ్యలు
- కాంగ్రెస్ నేత రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలోని ర్యాగింగ్ ఎక్కువగా ఉందంటూ యుజిసి చెప్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని పిసిసి నేత రామచంద్రారెడ్డి విమర్శించారు. వైద్య విద్యార్థి ప్రీతి విషయంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ లవ్ జిహాదీగా పేర్కొనడాన్ని ఆయన ఖండించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బండి సంజయ్ మాట్లాడే మాటలు అర్థం లేనివని విమర్శించారు. వరంగల్ సిపి నిష్పక్షపాతంగా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. బండి సమాజాన్ని విడదీసే వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రీతిని వేధించడం వల్లే ఈ ఘటన జరిగిందని చెప్పారు. సంజయ్ చౌకబారు మాటలు మానుకోవాలని అన్నారు. బిఆర్ఎస్ పాలనలో శాంతి భద్రతలు క్షీణించాయన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఆరె కులస్తులను ఒబిసిలో చేర్చాలి

- ఆరెకుల సంక్షేమ సంఘం చైర్మన్ కిషన్‌రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆరె కులస్తులను ఒబిసి జాబితాలో చేర్చాలని ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఆ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల సంఘంలో వివిధ రాజకీయ పార్టీల వారుంటారని తెలిపారు. ఆరెకుల సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా లింగంపల్లి కిషన్‌రావు తిరిగి ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షులుగా రెకెంధర్ చలపతిరావు, ప్రధాన కార్యదర్శిగా వరికెల శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులుగా ఏసికా శంకర్‌రావు, ఉపాధ్యక్షులుగా కృష్ణాజి, బానోపోలు శ్రీనివాస్, జెండా అంబయ్య, కర్రోల్ల సత్యం, కంటెడి రామోజీ, రాష్ట్ర కార్యదర్శులుగా దాపాడి బాలాజీ రావు, నిట్టె బాలరాజును ఎన్నుకున్నారు.

IN THE COURT OF THE IIND ADDL. DISTRICT JUDGE KURNOOL AT ADONI
I.A.No.68/2022 IN OS.NO.15/2018.

Between:
Smt. Edula Bharathi @ Challa Chandramma. ...Petitioner/Plaintiff
V/S
Challa Yerri Swamy and Four others. ...Respondents/Defendants

To
Under Section 5 of Limitation Act Notice.
R2) Smt. Lavanya w/o. Rajesh D/o. Yerri Swamy, R/o. H.No.27/78, Ramachandrapuram Village, Ranthana (Posto, Pattikonda Mandalam, Kurnool District, now residing at H.No.5/39, Shankar Nagar, Uppal, Hyderabad.

The above named petitioner filed the above I.A. in the above suit against you and for others for grant of Ad-Interim Injunction from alienating, creating, any charge, transferring or mortgaging the petition schedule properties in favour of third parties till the disposal of the suit. For Sec-5 of Limitation Act for the condone the delay for restore the suit. You are hereby informed to appear before this Hon'ble court on 16.03.2023 at 10:30 am in person or through Pleader to file your claim objections failing which the matter will be decided and determined in your absence.

A.M. JANARDHAN GOUD,
S.VENKATA REDDY &
A. LAKSHMI NARAYANA ,
ADVOCATES,
KURNOOL and ADONI

IN THE COURT OF THE IIND ADDL. DISTRICT JUDGE KURNOOL AT ADONI
I.A.No.69/2022 IN OS.NO.15/2018.

Between:
Smt. Edula Bharathi @ Challa Chandramma. ...Petitioner/Plaintiff
V/S
Challa Yerri Swamy and Four others. ...Respondents/Defendants

To
Under Order -9, Rule-9, C.P.C.
R2) Smt. Lavanya w/o. Rajesh D/o. Yerri Swamy, R/o. H.No.27/78, Ramachandrapuram Village, Ranthana (Posto, Pattikonda Mandalam, Kurnool District, now residing at H.No.5/39, Shankar Nagar, Uppal, Hyderabad.

The above named petitioner filed the above I.A. in the above suit against you and for others for grant of Ad-Interim Injunction from alienating, creating, any charge, transferring or mortgaging the petition schedule properties in favour of third parties till the disposal of the suit. For restore the suit dismiss for default. You are hereby informed to appear before this Hon'ble court on 16.03.2023 at 10:30 am in person or through Pleader to file your claim objections failing which the matter will be decided and determined in your absence.

A.M. JANARDHAN GOUD,
S.VENKATA REDDY &
A. LAKSHMI NARAYANA ,
ADVOCATES, KURNOOL and ADONI

ఉస్మానియా ఆస్పత్రిని కొత్త సచివాలయానికి మార్చాలి

- సిఎం కెసిఆర్‌కు హెచ్‌ఆర్‌డిఎ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోగులకు మేలు కలిగేలా ఉస్మానియా ఆస్పత్రిని కొత్త సచివాలయానికి తాత్కాలికంగా మార్చాలని హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్‌ఆర్‌డీఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం హెచ్‌ఆర్‌డిఎ అధ్యక్షులు డాక్టర్ కె.మహేష్ కుమార్ సిఎం కెసిఆర్‌కు లేఖ రాశారు. ఉస్మానియాకు కొత్త భవన నిర్మాణంతో పాటు పాతభవనాలను ఏమి చేయాలనే అంశాలపై నిర్ణయం తీసుకునేంత వరకు కొత్త సచివాలయాన్ని ఉపయోగించుకునేలా కేటాయించాలని కోరారు. ప్రస్తుతం తాత్కాలికంగా నిర్మించిన షెడ్లలో రోగులకు చికిత్స అందిస్తున్నారనీ, అన్ని వార్డులను కలిపివేయడంతో ఇరుకుగా, అసౌకర్యంగా ఉందని తెలిపారు. అక్కడి వాతావరణం రోగులకు, సిబ్బందికి ఇబ్బందికరంగా, అసౌకర్యంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉస్మానియా ఆస్పత్రి పాత, కొత్త భవనాల విషయంలో నిర్ణయం తీసుకోవడంలో వైద్యారోగ్యశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. పాత భవనాలను పాలన విభాగం కోసం వాడుకోవచ్చని సూచించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని జంగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు దిండి రమేష్‌రెడ్డి(41) శనివారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. తన వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదశాత్తు విద్యుదాఘాతానికి గురై చనిపోయారు. రమేష్‌రెడ్డి భార్య మూడు సంవత్సరాల క్రితం అనారోగ్యానికి గురై మృతి చెందారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రమేష్‌రెడ్డి కుటుంబ సభ్యులను అమ్రాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో పరామర్శించారు. కుటుంబానికి పార్టీ పరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు అమ్రాబాద్ ఎస్ఐ వీరబాబు తెలిపారు.

జియో అటెండెన్స్ నుంచి ఆశాలను మినహాయించాలి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

గ్రామీణ ఆరోగ్య (ఆశా) కార్యకర్తలను జియో అటెండెన్స్ నుంచి మినహాయించాలని బిఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు భూమోళ్ల కష్ణయ్య కోరారు. వికారాబాద్ కలెక్టర్‌కు విన్నవించేందుకు జిల్లాలో పనిచేస్తున్న ఆశ కార్యకర్తలతో కలిసి ఆయన శనివారం కలెక్టరేట్‌కు వచ్చారు. కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లడంతో ఏవో అమరేందర్‌కష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కష్ణయ్య మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఆశా కార్యకర్తలకు పని గంటలంటూ లేవని, 24 గంటల పనిచేస్తారన్నారు. ఏ సమయంలో ఎక్కడ ఉంటారో తెలియదని, గ్రామాల్లో ఆరోగ్య సర్వేలు, గర్భిణుల ప్రసవాల సమయంలో ఏరియా ఆసుపత్రికి వెళ్లి ప్రసవమయ్యేంత వరకు అక్కడే ఉండడం వల్ల పీహెచ్‌సీ, సబ్ సెంటర్‌కు వచ్చి హాజరు వేసుకోవడం సాధ్యం కాదని తెలిపారు. జియో అటెండెన్స్ యాప్‌తో ఆశా కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఆశా కార్యకర్తలకు గౌరవ వేతనమే ఇస్తున్నారని తెలిపారు. కలెక్టర్, డీఎంహెచ్‌వో స్పందించి ఆశా కార్యకర్తల పట్ల మానవతా దక్పథంతో ఆలోచించి వారికి జియో అటెండెన్స్ యాప్ నుంచి మినహాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ ఆరోగ్య ఆశా కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు మంజుల, ప్రధాన కార్యదర్శి అనిత, సంఘం బాధ్యులు జగదేవి, కౌసల్య, ఇందిర, అనూష, శ్యామల, ఊర్మిళ, చంద్రకళ, కష్ణవేణి పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల భిక్షాటన

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

ఐదు నెలలుగా వేతనాలు రాక గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. వేతనాలు చిల్లించాలని కోరుతూ శనివారం భిక్షాటన చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ... జీతాలు రాక కుటుంబ పోషణ భారంగా మారిందని, కుటుంబ అవసరాలకు అప్పులు చేయాల్సి వస్తుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం స్పందించి బకాయి పడ్డ జీతాలను వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా నేత బాలమణి ఆధ్వర్యంలో రామాయంపేట మండల పరిధిలోని దంతెపల్లి, అక్కన్నపేట, తొనిగండ్ల, లక్ష్మాపూర్ గ్రామాల్లో కార్మికులు వీధి వీధిన తిరుగుతూ భిక్షాటన చేపట్టారు. నిజాంపేటలో బాలమణి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పారిశు?ధ్య కార్మికులు భిక్షాటన చేపట్టారు. ఈ కార్యక్రమంలో కారోబార్ కొండల్‌రెడ్డి, బత్తుల రాములు, ఇంధిరా, గర్గుల ఎల్లవ్వ, నరసవ్వ, నాగవ్వ, కుమార్ తదితరులు పాల్గొన్నారు. శివ్వంపేటలో ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్లకార్డులతో కార్మికులు నిరసన వ్యక్తం చేసి, భిక్షాటన చేశారు.

సానుభూతి, దయతో విద్యకు పరిపుష్టి

- న్యాయ పుస్తకాలే కాదు... సాహిత్యం చదవాలి
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సానుభూతి, దయ వంటి విలువైన లక్షణాలను అలవర్చుకోవాలనీ, వాటితోనే విద్య పరిపుష్టి అవుతుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీ.వై.చంద్రచూడ్ విద్యార్థులకు సూచించారు. శనివారం హైదరాబాద్ జస్టిస్ సిటీలోని నల్సార్ విశ్వవిద్యాలయం 19వ స్నాతకోత్సవం, రజతోత్సవం ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సానుభూతి విలాసవంతమైనదేమీ కాదంటూ, అది న్యాయం పొందేందుకు ఉన్న అడ్డంకులను తొలగిస్తుందని తెలిపారు. భారీ సంఖ్యలో వచ్చే వాహన ప్రమాద కేసుల విషయంలో అనేక సాంకేతిక అంశాలున్నప్పటికీ సానుభూతితోనే సుప్రీంకోర్టు వాటిని పరిష్కరిస్తుందని ఉదహరించారు. స్నాతకోత్సవ శుభ సందర్భంలో విద్యార్థులు సమాజంలోని అనేక విషయాలను తెలుసుకునేందుకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేల ఏండ్ల సంవత్సరాల తరవాత విద్యనభ్యసించే అవకాశమొచ్చిన అట్టడుగు వర్గాల విద్యార్థుల్లో ఆత్మహత్యలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా ఆయన ముంబయి, ఒడిశాలో ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఇద్దరు విద్యార్థుల ఉదంతాలను ఉదహరించారు. తాత్విక దృక్కోణం, దయా దృష్టితో ఉన్నత విద్య ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు.

నేటి తరం విద్యార్థులకు లోతైన జ్ఞానం, సమాచారం పొందే అవకాశాలొచ్చాయని తెలిపారు. విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న విద్యార్థులు కేవలం బోధనా సిబ్బందిని మాత్రమే గుర్తుంచుకోవడం కాదనీ, ఆ విద్యాసంస్థ అభివృద్ధిలో భాగస్వాములైన సిబ్బంది, వర్కర్లను కూడా గుర్తుంచుకోవాలని సూచించారు. సుప్రీంకోర్టు గుర్తించిన జీవించే హక్కులో భాగమైన ఆత్మగౌరవానికి అదే నిజమైన అర్థమని తెలిపారు. కేవలం చట్టం, న్యాయానికి సంబంధించిన పుస్తకాలే కాకుండా ఇతర పుస్తకాలను చదవడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. కోర్టు దృష్టిలో అందరూ సమానులేనని తెలిపారు. అధికారం మరింత బాధ్యతతో కూడుకుని ఉంటుందన్నారు. సమాజంలో న్యాయం దక్కని వ్యక్తికి దానిని అందించేందుకు దయ ఒక ముఖ్యమైన అంశమని తెలిపారు. అది న్యాయానికి ఉండే ముఖ్యమైన కోణమని వివరించారు. విద్యార్థుల మధ్య పోటీ తత్వాన్ని పెంచేందుకే పరిమితం కాకుండా జీవితానికి ముఖ్యమైన సానుభూతిని పెంచడంపై దృష్టి సారించాలని జస్టిస్ చంద్రచూడ్ విద్యాసంస్థలకు సూచించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భయాన్ అధ్యక్షత వహించగా, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కృష్ణారావు స్వాగతోపన్యాసం ఇచ్చారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.విద్యుల్లత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహకార ఉద్యమ నేత మల్లయ్య మృతి

- సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సంతాపం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సామాజిక సహకార ఉద్యమ నేత, కొండ లక్ష్మణ్ బాపూజీ సహచరులు ఎఎల్ మల్లయ్య (85) శనివారం మధ్యాహ్నం హైదరాబాదులో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మరణం బాధాకరమంటూ సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతికి సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చేతి వృత్తిదారులందరూ సమాజంలో అభివృద్ధి చెందాలంటే సహకార రంగం ఎంతో ఉపయోగమనీ, దాని నిర్మాణానికి కృషి చేసినవారిలో మల్లయ్య ముఖ్య పాత్ర పోషించారని తెలిపారు. జీవితకాలమంతా గంగపుత్రుల అభివృద్ధికి మత్స్యకారుల చైతన్యానికి ఎనలేని కృషి చేశారని గుర్తుచేశారు. వారి మరణం అణగారిన సామాజిక వర్గాలకు తీరని లోటని చెప్పారు. మల్లయ్యకు నివాళు లర్పించినవారిలో తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎంఎన్ శ్రీనివాస్‌రావు, హైదరాబాద్ నగర మత్స్య కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు కొప్పు పద్మ, మూఠా విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు. మల్లయ్య మరణం పట్ల టిపిసిసి అధ్యక్షులు, ఎంపి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. మల్లయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ నేతలు మహేష్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్‌గౌడ్, ఫిషర్మెన్ విభాగం రాష్ట్ర చైర్మెన్ మెట్టుసాయికుమార్, ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తదితరులు ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

ప్రీతికి న్యాయం చేయాలని ఐద్వా నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిజి వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారణమైన సీనియర్ విద్యార్థి సైఫ్‌ను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఐద్వా హన్మకొండ సౌత్ మండల కార్యదర్శి సాంబరాజు శ్వేతా డిమాండ్ చేశారు. శనివారం అదాలత్ సెంటర్‌లో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా మండల అధ్యక్షులు బుడిద రాధ, కార్యదర్శి శ్వేతాలు మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థిని డాక్టర్ ప్రీతికి న్యాయం చేయాలని, సైఫ్‌తోపాటు కళాశాల యాజమాన్యంపై చర్య తీసుకోవాలన్నారు. డాక్టర్ ప్రీతి కాకతీయ మెడికల్ కాలేజీలో జాయిన్ అయిన మొదటి రోజు నుండే సీనియర్ విద్యార్థి సైఫ్ ఖాన్ వేధింపులు మొదలయ్యాయని చెప్పారు. రోజురోజుకూ వేధింపులు ఎక్కువవడంతో ప్రిన్సిపల్ మధుసూదన్, హెచ్ఒడి నాగార్జునరెడ్డికి ప్రీతి ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం వహించడం వల్లే ఆమె ప్రాణాల మీదకు వచ్చిందన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే మేమున్నాం కదా మీరెందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారని అక్కడున్న హెచ్ఒడి ప్రీతిని మందలించారన్నారు. కాలేజ్ మేనేజ్‌మెంట్‌తోపాటు సైఫ్‌ను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రీతికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో మహిళల రక్షణ కోసం ఎన్నో చట్టాలు ఉన్నా మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఈ ఘటనతో మరోసారి రుజువైందన్నారు. ఈ కార్యక్రమంలో సుకర్ణ, విజయ, రాణి, ప్రేమలత, స్రవంతి, కవిత, సుజాత, లక్ష్మీ, యశోద తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో భూ పోరాటం

- ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరు
- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గుడిసెలు వేసేందుకు సిద్ధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదలకు ఇళ్ల స్థలాల కోసం ప్రజాసంఘాలు పోరాటం ప్రారంభించాయి. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం నెహ్రూనగర్ గ్రామస్తులు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం జానకంపేట్ శివారులో శనివారం స్థలాన్ని చదును చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు మాట్లాడారు. 50 సంవత్సరాల నుంచి నిరుపేదలైన గ్రామీణ శ్రామికులు నెహ్రూనగర్‌లో సొంత ఇళ్లు లేకుండా అద్దె ఇళ్లల్లో కాలం వెళ్లదీస్తున్నారని చెప్పారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా నాయకులు వీరి ఓట్లను ఉపయోగించుకొని.. తర్వాత వీరి సమస్యలను విస్మరించడం రివాజుగా మారిందన్నారు. కనీసం వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టించాలనే సోయిలేకుండా పోయిందన్నారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కార్మిక కర్షకుల ఐక్యతతో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం కలిసి భూ పోరాటానికి సిద్ధమైనట్టు తెలిపారు. గ్రామంలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతోందన్నారు. భూ పోరాటానికి గ్రామ ఎంపిటిసి ఇమ్రాన్ ఖాన్ మద్దతు ఇచ్చినట్టు తెలిపారు. పేదలకు ఇళ్ల స్థలాలు దక్కేవరకు పోరాటం కొనసాగుతుందని, ఆటంకపరిస్తే పోరాటాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. స్థలాలు ఉన్న పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పక్కా ఇండ్లు నిర్మించుకునే వరకూ పోరాటాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్, ఎంపీటీసీ ఇమ్రాన్ ఖాన్, హాయ్ మన్సూర్ ఖాన్, ఫారూఖ్, గంగమణి, షమీం, జహీరాబి, పేద ప్రజలు పాల్గొన్నారు.

ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలి

- లేదంటే ఉద్యమం తప్పదు
- 28న హైదరాబాద్‌లో గ్రామ పంచాయతీ కార్మికుల పాదయాత్ర ముగింపు సభ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం నెలకు రూ.26 వేలు నిర్ణయించాలనీ, గ్రామ పంచాయితీ కార్మికులకు కూడా మున్సిపల్ కార్మికులకు ఇస్తున్నట్టుగానే జిఒ 60 ప్రకారం వేతనాలు. పెంచాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పాలడుగు భాస్కర్,అధ్యక్షులు గ్యార పాండు,ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో రద్దు చేసిన పాత కేటగిరీలను పునరుద్ధరించాలని కోరారు. జిఒ 51ని సవరించి, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించి వారిని అసిస్టెంట్ కార్యదర్శులుగా నియమించాలని పేర్కొన్నారు. దశాబ్దాల తరబడి కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి అప్రజాస్వామిక పద్ధతిలో తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని తదితర డిమాండ్లతో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఈ నెల 12న పాలకుర్తినుంచి ఆరుగురు రాష్ట్ర నాయకుల బృందంతో పాదయాత్ర నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. ఈ యాత్ర 17 రోజుల్లో 350 కిలోమీటర్లు పూర్తి చేసుకొని 28న హైదరాబాద్ చేరుకోనున్నదని తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సుందరయ్య పార్క్ నుంచి ఇందిరా పార్క్ వరకు పాదయాత్ర కొనసాగుతుందనీ, అక్కడ ముగింపు సభ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. సభలో సిఐటియు అఖిలభారత కోశాధికారి ఎం సాయిబాబు, మిర్యాలగూడెం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్, వివిధ యూనియన్లు, ప్రజాసంఘాల నేతలు పాల్గొంటారని తెలిపారు.

ఇంటర్ బోర్డుపై అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు

- సిజిజిపై సమగ్ర విచారణ జరపాలి
- తెలంగాణ ఇంటర్ విద్యా పరిరక్షణ సమితి డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్ బోర్డ్‌పైనా, అధికారులపైనా కొందరు వ్యక్తులు స్వార్థంతో చేసే అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని తెలంగాణ ఇంటర్ విద్యా పరిరక్షణ సమితి (టిప్స్) తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం కన్వీనర్లు మాచర్ల రామకృష్ణగౌడ్, కొప్పిశెట్టి సురేష్, సమన్వయకర్త మైలారం జంగయ్య శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ విద్యావ్యవస్థను నాశనం చేసేందుకు, విద్యార్థుల జీవితాలను చెలగాటం ఆడేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. 2019లో అనుభవం ఉన్న వ్యక్తులు పరీక్షలు నిర్వహించినా అవకతవకలు జరగడంతో 27 మంది, 2021లో అవసరం లేని సమయంలో పరీక్షలు నిర్వహించడంతో ఆరుగురు విద్యార్థులు మరణించారని గుర్తు చేశారు. ఆ చావులకు కారణమైన వారిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. చదువు చెప్పని, పరీక్షలకు సంబంధం లేని వ్యక్తులు కొన్ని మీడియా సంస్థలకు తప్పుడు సమాచారం పంపుతూ అనుభవం లేని వ్యక్తులు ఇంటర్ బోర్డులో తిష్ట వేశారంటూ బదనాం చేస్తున్నారని తెలిపారు.

అలాంటి వారు ఎవరున్నారో ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు. అసత్య ప్రచారంతో ప్రజల్లో, సమాజంలో అలజడి సృష్టించడానికి కుట్ర జరుగుతున్నదనీ, రాబోయే ఇంటర్ పరీక్షలు, విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మ్యాగ్నటిక్ టెక్నాలజీ సంస్థ, ప్రస్తుతం పనిచేస్తున్న సీజీజీతోపాటు ఇంటర్ బోర్డులో గతంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారు, ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్న వారిపై సమగ్ర విచారణ జరపాలంటూ విద్యాశాఖ మంత్రి, కార్యదర్శి, ఇంటర్ బోర్డు కార్యదర్శిని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గట్టి నిఘాను ఏర్పాటు చేయాలని కోరారు.

కుక్కలు, కోతుల బెడద నివారణకు వినూత్న ప్రయోగం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుక్కలు, కోతుల దాడులను నివారించేందుకు ఖమ్మం జిల్లా వైరా మండలం పాలడుగు గ్రామపంచాయతీ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. పలు గ్రామాలలో కోతులతో పాటు కుక్కల బెడదను తట్టుకోలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కుక్కలు, కోతుల బెడద వలన చిన్నారులు, మహిళలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. పాలడుగులో గ్రామపంచాయతీ వర్కర్ నెల్లూరు రాజేష్‌కు ఎలుగుబంటి వేషధారణ ధరింపజేసి, అతనిని గ్రామ వీధుల్లో తిప్పుతున్నారు. ఎలుగుబంటి వేషధారణలో ఉన్న రాజేష్‌ని చూసిన కుక్కలు, కోతులు చూసి గ్రామం నుంచి పరారు అవుతున్నాయి. మండలంలోని పలు గ్రామాలలో సాగు చేస్తున్న మొక్కజొన్న పొలాల్లోని కంకులను కోతులు ఆగం చేయకుండా ఇదే విధానాన్ని రైతుల అవలంబిస్తున్నారు. ఎలుగుబంటి వేషధారణతో కుక్కలు, కోతుల బెడద నుంచి కొంత ఉపశమనం లభిస్తుందని పాలడుగు గ్రామస్తులు తెలియజేశారు.

ప్రజల పైసలతో ఆటలా ?

- అదాని వ్యవహారంపై ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం
- ముంబయిలో ఘనంగా స్వాగతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎల్ఐసి సంస్థ డబ్బులు ఆవిరవుతుంటే, కేంద్రం ఎందుకు మౌనంగా ఉందని బిఆర్ఎస్ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. అదాని కంపెనీల్లో ఎల్ఐసి పెట్టిన పెట్టుబడుల విలువ 11 శాతం మేర పడిపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ముంబయిలో బిఆర్ఎస్ కార్యకర్తలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ విగ్రహానికి కవిత నివాళు లర్పించారు. అ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల డబ్బులతో ఆటలాడటం ఏంటని ప్రశ్నించారు. ఎల్ఐసిలో పెట్టుబడులు పెట్టిన మధ్య తరగతి ప్రజలకు మోడీ ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుందని నిలదీశారు. ఇంత పెద్ద కుంభకోణం జరిగి దాదాపు రూ. 12 లక్షలకోట్లు నష్టపోయినా సిబిఐ, ఈడీ, ఆర్‌బిఐ వంటి సంస్థలు ఎందుకు మౌనంగా ఉంటున్నాయని ప్రశ్నించారు. హిండెన్‌బర్గ్ నివేదిక బహిర్గతమైనప్పటి నుంచి ఆదానీ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. అప్పుడే కేంద్రం జెపిసి ఏర్పాటు చేస్తే ప్రజలు మరింత నష్టపోయేవారు కాదని తెలిపారు. ఇప్పటికైనా కేంద్రం కండ్లు తెరిచి మరింత నష్టం జరగకుండా చూడాలని సూచించారు. తెలంగాణలో జరుగుతున్న పనులు మహారాష్ట్రలో ఎందుకు జరగలేదని కవిత ప్రశ్నించారు. ముంబయిలో రోజుకు రెండు గంటలే మంచినీళ్లు సరఫరా అవుతున్నాయని తెలిపారు. రానున్న కాలంలో మహారాష్ట్ర అభివృద్ధిలో తమ పార్టీ కీలక భాగస్వామి అవుతుందనీ, ఇక్కడి ప్రజల కోసం తాము పని చేస్తామని చెప్పారు. ఈ పర్యటనలో శరత్‌పవార్, ఉద్ధవ్ ఠాక్రే వంటి నాయకులను కలుస్తారా? అని విలేకరులు అడగ్గా... శరత్ పవర్‌తో కెసిఆర్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయనీ, ఉద్యమానికి కూడా ఆయన ఎంతగానో తోడ్పడ్డారని వివరించారు. కార్యక్రమంలో మహారాష్ట్ర బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిపిఎస్ ఉద్యోగుల డైరీని ఆవిష్కరించిన హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ఈయూ) డైరీని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి హరీశ్‌రావు శనివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. సమగ్ర సమాచారంతో రూపొందించిన ఈ డైరీ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. సీపీఎస్ ఉద్యోగులకు ముఖ్యమంత్రి కెసిఆర్ పాత పెన్షన్ పద్ధతిలో కుటుంబ పెన్షన్‌ను మంజూరు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేష్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మ్యాన పవన్, దర్శన్‌గౌడ్, ఉపేందర్, మల్లికార్జున్, దేవయ్య, నరేందర్‌రావు, కోటకొండ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఇటీవల ఫ్యామిలీ పెన్షన్ ఆర్డర్స్ వచ్చిన సందర్భంగా ఇద్దరు పెన్షనర్లకు రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ చేతుల మీదుగా వాటిని అందించారు.

మిషన్ కాకతీయ అధ్యయనానికి పంజాబ్ బృందం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ ఈనెల 16న మాన్ కొండపవచ్చమ్మ సాగర్, సిద్దిపేట జిల్లాలో మిషన్ కాకతీయ చెరువులు, చెక్ డ్యాంలను సందర్శించిన సంగతి తెలిసిందే. అనంతరం పంజాబ్ తిరిగి వెళ్ళిన తర్వాత పంజాబ్ వ్యవసాయ విశ్వ విద్యాలయ అధికారులను పిలిచి తెలంగాణలో మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని , దాని వలన రాష్ట్రంలో భూగర్భ జలాల అభివృద్ధి ఎట్లా జరిగిందో అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆమేరకు ముగ్గురు సభ్యుల బృందం ఈ నెల 28న రాష్ట్రానికి రానుంది. వారంతా మార్చి ఒకటి, రెండు తేదీల్లో తెలంగాణలో మిషన్ కాకతీయ చెరువులు, చెక్ డ్యాంలు, భూగర్భ జలాల రీచార్జింగ్ ఏర్పాట్లను పరిశీలించనున్నారు. సాగునీటి శాఖ, భూగర్భ జల శాఖ వారి అధ్యయనానికి అన్నీ ఏర్పాట్లు చేస్తున్నారు. వారికి చూపించాల్సిన చెరువులు, చెక్ డ్యాంలను ఎంపిక చేసే పనిలో ఉన్నారు. సోమవారం నాటికి రెండు లేదా మూడు జిల్లాల్లో పర్యటన షెడ్యూల్ ఖరారు అవుతుందని ఇంజనీర్ ఇన్ చీఫ్ సి. మురళీధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారి పర్యటనకు తగిన ఏర్పాట్లు చేయమని గజ్వేల్ ఇంజినీర్ ఇన్ చీఫ్ హరిరాం, భూగర్భ జల శాఖ సంచాలకుడు పండిత్ మధూరేను ఆదేశించినట్టు చెప్పారు.

పిఆర్‌సి కమిటీని వెంటనే నియమించాలి : టిఎపిఆర్‌పిఎ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పిఆర్‌సి కమిటీని వెంటనే నియమించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టిఎపిఆర్‌పిఎ) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించింది. టిఎపిఆర్‌పిఎ అధ్యక్షులు పాలకుర్తి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి మచ్చా రంగయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం లోపభూయిష్టంగా తయారైందని తెలిపారు. నగదు రహిత వైద్యం ఎక్కడా అమల్లో లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇపిఎఫ్ పెన్షనర్లకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ.తొమ్మిది వేలు పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ సెంటర్లను వరంగల్, నిజామాబాద్‌లో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సీతారాం, అరుణ, రామ్మోహన్‌రావు, వైకుంఠం, సుజావతి, గడ్డం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మూల్యాంకనాన్ని స్వాగతిస్తున్నాం

- టిజిఒ ఇంటర్ విద్యాఫోరం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్ విద్యలో విద్యార్థుల జవాబు పత్రాలను ఆన్‌లైన్ మూల్యాంకనాన్ని స్వాగతిస్తున్నామని టిజిఒ ఇంటర్ విద్యాఫోరం స్వాగతించింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షులు ఎ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇస్మాయిల్, అసోసియేట్ ప్రెసిడెంట్ వి ప్రవీన్‌కుమార్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అపోహలకు తావులేకుండా ఆన్‌లైన్ మూల్యాంకనం చేపట్టాలని నిర్ణయించడం శుభపరిణామమని తెలిపారు. ఈ పరిస్థితుల్లో సస్పెండైన, జీజేఎల్ఏ నాయకుడు అపోహలు సృష్టించడం వల్ల ఎవరికి మేలు కలుగుతుందని ప్రశ్నించారు. శాస్త్రీయ పద్ధతిలో పారదర్శకంగా చేపట్టే ఆన్‌లైన్ విధానాన్ని వ్యతిరేకించడం సమంజసం కాదని పేర్కొన్నారు.